క్లుప్తంగా

పాముకాటుకు వ్యక్తి మృతి



చెరుకుపల్లి: హోటల్లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వ్యక్తి పాము కాటుకు మృతి చెందిన ఘటన చెరుకుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం జరిగింది. చేరుకుపల్లి గ్రామానికి చెందిన కె.అంకమ్మరావు(30) చెరుకుపల్లి భాస్కర్ సిని మాహాల్ వెనుక ఉన్న ఓ హోటల్లో పగలు పని చేసుకుని రాత్రి వాడకంలో లేని పాత బస్టాండ్‌లోనే నివాసం ఉంటున్నాడు. 29వ తేదీ మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో బస్టాండులోనే కింద పడుకున్న సమయంలో చీకటిలో ఎడమ చేతి వేలుపై పాము కాటువేయగా వెంటనే దగ్గరలోని వారు ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు, అంకమ్మరావు చికిత్స పొందుతూ 30వ తేదీ బుధవారం మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.అనీల్ కుమార్ తెలిపారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి

అమర్తలూరు(వేమూరు): రైతులందరూ పంట బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి లోకేశ్వరి చెప్పారు. అమర్తలూరు మండలంలోని మూల్పూరు, పెదపూడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పైరులో దోమపోటు, అగ్గి తెగులు, మానిపండు తెగుళ్ల కనిపిస్తున్నాయని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. పంటలకు రైతులు బీమా చేయించుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ పెదపూడి ఆనందబాబు, రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్యూబాపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలి



బాపట్లటౌన్: క్యూబాపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.మజుందార్ తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో క్యూబా సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. మజుందార్ మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదంతో క్యూబాపై ఆంక్షలు విధిస్తూ ఆర్థిక సంక్షోభంలోకి నెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.బుచ్చిరాజు, కిషోర్, గోపి, ప్రసాద్, చందు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



బాపట్ల: జగనన్న కాలనీలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య పేర్కొన్నారు. స్థానిక ఒకటో వార్డులోని జగనన్న కాలనీలో ప్రజలతో కలిసి సమస్యలపై నిరసన వ్యక్తం చేశారు. కక్షసాధింపు చర్యలు మానుకుని కాలనీలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. నిరసన తెలిపిన వారిలో భోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆకురాతి విష్ణుమూర్తి, వాలి ధనుంజయ్‌రెడ్డి ఉన్నారు.

సూర్యలంక పార్కింగ్ ప్రదేశం వేలంపాట రూ.19.50 లక్షలు

బాపట్లటౌన్: సూర్యలంక సముద్రతీరంలో వాహనాల పార్కింగ్ ప్రదేశం వేలం పాటను బుధవారం నిర్వహించారు. వేలంపాటలో ఆదర్శనగర్ గ్రామానికి చెందిన మోకా వసంతరావు రూ.19.50 లక్షలకు దక్కించుకున్నారు. సాయంత్రం 2 గంటల నుంచి 5 గంటల మధ్య సాగిన వేలంపాటలో 360 మంది పాల్గొన్నారు. అడవి పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ సలీమా మాట్లాడుతూ రూ.18 లక్షలతో పాటను ప్రారంభించామని, రూ. 19.50 లక్షలకు మోకా వసంతరావు దక్కించుకున్నారని పేర్కొన్నారు. వేలంపాటలో టోల్‌గేట్‌ను దక్కించుకున్న వ్యక్తి నవంబర్, డిసెంబర్ రెండు నెలలపాటు మాత్రమే ఫీజు వసూలు చేసుకోవాలని వివరించారు.

ఫిర్యాదులు త్వరగా పరిష్కరించండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



తెనాలిఅర్బన్: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించే విధంగా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 1,2,35,37,39,40 వార్డులలోని సచివాలయాలను బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రజలు తెలియజేసిన ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలని సూచించారు. సచివాలయంకు వచ్చిన వారితో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. అనంతరం ఆయా వార్డులలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.



తోకలవారిపాలెం వద్ద వరద ప్రవాహానికి కోతకు గురైన రహదారి



భారీ గోతులతో తటాకాలను తలపిస్తున్న పెసర్లంక-కొత్తూరు లంక రోడ్డు

దారి కాచిన కష్టాలు

● గతుకులు రోడ్లు... ప్రయాణికుల పాట్లు ● వరదలకు తీవ్రంగా కోతకు గురైన దారులు ● రహదారుల మరమ్మతులు శూన్యం

కొల్లూరు : ప్రజా రవాణా.. వ్యవసాయోత్పత్తుల తరలింపునకు వినియోగించే రహదారులు గతుకుల మయంగా మారడంతో ప్రయాణికుల పాట్లు వర్ణనాతీతంగా మారాయి. కృష్ణా నదికి సంభవించిన వరదల వల్ల లంక గ్రామాలలోని కొల్లూరు-గాజుల్లంక, పెసర్లంక-కొత్తూరులంక, గాజుల్లంక-కిష్కిందపాలెం, తిప్పలకట్ట-పోతార్లంక, రహదారులు కోతకు గురయ్యాయి. వరదలు తగ్గిన అనంతరం పెసర్లంక-కొత్తూరులంక, కొల్లూరు-గాజుల్లంక రహదారులలో సీఎం చంద్రబాబు పర్యటన ఉంటుందన్న ఉద్దేశంతో స్టోన్ డస్ట్ పోసి చేతులు దులుపుకున్నారు. అయితే ఇప్పుడు ఆ రహదారులు మళ్లీ అధ్వానంగా మారాయి. నరకాన్ని తలపిస్తున్నాయి. రోడ్లు మొత్తం గతుకులతో నిండిపోయి ఉండటంతో ఆ మార్గాలలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఒళ్లు హూనం అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గాజుల్లంక-కిష్కిందపాలెం రహదారి పలు ప్రాంతాలలో కోతకు గురైంది. ప్రమాదకరంగా మారినా మరమ్మతులు చేపట్టలేదు. దీంతో వాహనదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రావికంపాడు, చిలుమూరు రోడ్లు కూడా ప్రయాణానికి పనికిరాని తీరులో ఛిద్రమవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి రహదారుల వ్యవస్థను మెరుగు పరచాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన కొల్లూరు-గాజుల్లంక ఆర్‌అండ్‌బీ రోడ్డు

చిన్నారులు సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలి



రేపల్లెలో చిన్నారులతో ప్రత్యేక పూజలు చేయిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



రేపల్లెలో రామకృష్ణ పబ్లిక్ స్కూలులో దీపావళి వేడుకలు

రేపల్లె రూరల్: చిన్నారులు సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలని, పండుగల విశిష్టతను తెలుసుకోవాలని సీడీపీఓ సుచిత్ర అన్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. మంచిపై చెడు గెలిచినందుకు చిహ్నంగా, కులమతాలకు అతీతంగా జరుపుకునే దీపావళి పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారులతో లక్ష్మీపూజ, దీపారాధన చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగలక్ష్మి, నసీమా, ఆయాలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ పబ్లిక్ స్కూల్‌లో..

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రామకృష్ణ పబ్లిక్ స్కూలులో నిర్వహించిన వేడుకలను స్కూల్ కరస్పాండెంట్ కుర్రా అవర్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణానికి నష్టం చేకూర్చే మందుగుండు సామగ్రిని దూరంగా ఉండి దివ్వెలను వెలిగించి దీపావళిని జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ డాక్టర్ మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన దిగుబడులు సాధించాలి

రేపల్లె రూరల్: ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ రైతులు సాగులో నాణ్యమైన దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.వి జయ్‌బాబు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వడ్డీవారిపాలెం, సింగుపాలెంలోని సాగుభూమిలో వరి క్షేత్రాలను ఆయన పరిశీలించి అనంతరం రైతులకు అవగాహన కల్పించారు. సాగులో ఎప్పుడూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే విధానాలను అవలంబించాలన్నారు. నిత్యం పైరును పరిశీలిస్తూ అవసరమైన సమయంలో ఎరువులు వినియోగించాలన్నారు. సాగులో సందేహాలు కలిగితే వ్యవసాయ అధికారులను కలిసి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు సిహెచ్ సుమ, ఐ.సుప్రజ, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.



వడ్డీవారిపాలెం వరిక్షేత్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి విజయ్‌బాబు తదితరులు

ప్రకృతి సేద్యంతో నాణ్యమైన దిగుబడులు

అల్లూరు(కర్లపాలెం): ప్రకృతి సేద్యంతో నాణ్యమైన దిగుబడులు వస్తాయని, మార్కెట్‌లో మంచి ధర వస్తుందని రైతు సాధికార సంస్థ సీనియర్ కో-ఆర్డినేటర్లు ప్రభాకర్, చంద్రశేఖర్ చెప్పారు. పిట్టలవానిపాలెం మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేస్తున్న వరి పొలాలను, పూలతోటలను సీనియర్ కో-ఆర్డినేటర్లు పరిశీలించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం రైతులు గ్రామ సంఘం సమావేశంలో పాల్గొన్నారు. వారు రైతులతో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేయటం వలన తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంటలు పండించగలుగుతామని చెప్పారు. రసాయన ఎరువుల వినియోగానికి స్వస్తి పలకాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ వాణిశ్రీ, బాపట్ల డివిజన్ కో-ఆర్డినేటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



బంతిపూల తోటను పరిశీలిస్తున్న రైతు సాధికార సంస్థ మాస్టర్ ట్రైనర్లు చంద్రశేఖర్, ప్రభాకర్

క్రీడా పోటీల్లో సత్తా చాటిన ఐలవరం విద్యార్థులు

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కి చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.మోహన్‌రావు తెలిపారు. ఈనెల 27న పెనుమాకలో జరిగిన ఎస్‌జీఎఫ్‌ఏ అండర్-14 యోగా పోటీలలో కె.సంపత్, ఎం.జితేంద్రనాథ్ మణికంఠ, సీహెచ్ డోలా పూర్ణ చంద్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరు నవంబర్ 2 నుంచి నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. అలాగే బాపట్లలో జరిగిన అండర్-14 కబడ్డీ పోటీలలో పాల్గొన్న వి.చైతన్య కుమార్ కూడా రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. అదే విధంగా రాష్ట్రస్థాయి సీనియర్ షూటింగ్ బాల్ పోటీలకు కె.అనీల్ కుమార్, కె.రాజశేఖర్, బి.సీతా మహాలక్ష్మి, ఎల్.రమ్య, ఇ.హరిణి, వి.రాధికాప్రియ, జి.సాయి సింధుజలు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డిని హెచ్‌ఎం ఎం.మోహన్‌రావు, ఉపాధ్యాయులు కె.బదరీనాథ్ తదితరులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు మోహన్‌రావు, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి

మండల పరిషత్ అభివృద్ధికి సహకరించాలి

వేమూరు: మండల పరిషత్ అభివృద్ధికి అధికారులందరూ పూర్తిగా సహకరించాలని ఎంపీపీ యల్లమాటి మోహనరావు చెప్పారు. మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. సభకు ఎంపీపీ యల్లమాటి మోహన్ అధ్యక్షత వహించారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ రైతులకు రబీ సీజన్‌కు అవసరమైన సబ్సిడీ విత్తనాలు సవ్యంగా అందించాలని సూచించారు. ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో రోడ్లు నిర్మిస్తోందని, ఆ పనులు నాణ్యంగా చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ శివన్నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు సామాజిక పింఛన్ల పంపిణీని జయప్రదం చేయాలని కోరారు. తహసీల్దారు సుశీల మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఉపాధి పనులను గుర్తించి బడ్జెట్ ప్రతిపాదనలు తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప ఎంపీపీ షేక్ బాజీ, ఎంపీటీసీలు ఈపూరు కుసుమా, వేమూరు సుజాత, తలతోటి సువర్ణరావు, బొల్లిముంత వెంకటేశ్వమ్మ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యల్లమాటి మోహనరావు

బాణసంచాతో జాగ్రత్త

చెరుకుపల్లి: బాణసంచా కాల్చేటప్పుడు ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని స్థానిక ఎస్సై అనీల్‌కుమార్ పాన్నూరు అగ్రిమాపక అధికారి ప్రసాదరావు సూచించారు. దీపావళి పర్వదినం సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను బుధవారం వారు పరిశీలించి వారికి తగు సూచనలు చేశారు, ఎస్సై అనీల్ కుమార్ మాట్లాడుతూ మండలంలో బాణసంచా విక్రయించుకునేందుకు 22 దుకాణాలకు అనుమతులు మంజూరు చేశామన్నారు, దీపావళి షాపుల వద్ద ప్రశాంతంగా విక్రయాలు జరపాలన్నారు. అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే వస్తువులను దగ్గరలో ఉంచరాదని, నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. అనంతరం ఫైర్ ఆఫీసర్ కె.ప్రసాదరావు మాట్లాడుతూ టపాసులు ఖాళీ ప్రదేశాల్లో కాల్చటం ఉత్తమమని, కాల్చే సమయంలో కాటన్ దుస్తులు, కాళ్ళకు చెప్పులు కచ్చితంగా ధరించాలని చెప్పారు. ముఖ్యంగా పేలుడు టపాసులు చేతిలో పట్టుకుని కాల్చటం ప్రమాదకరమన్నారు. బాణసంచా విక్రయ దుకాణాల వద్ద డ్రమ్ముల్లో నీరు, ఇసుక బకెట్లు సిద్ధగా ఉంచాలని దుకాణదారులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాసరావు పోలీస్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.



చెరుకుపల్లి లో బాణసంచా దుకాణాలను పరిశీలించిన ఎస్సై అనీల్‌కుమార్ ఫైర్ ఆఫీసర్ ప్రసాదరావు

యూనియన్ బ్యాంకు సిబ్బందికి స్వీట్లు పంపిణీ

కర్లపాలెం: దీపావళి పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని కర్లపాలెం యూనియన్ బ్యాంక్ మేనేజర్ మానస చెప్పారు. దీపావళి పండుగను పురస్కరిచుకుని బుధవారం బ్యాంకు సిబ్బందికి మేనేజర్ మానస స్వీట్ బాక్సులు అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ అందరూ తమ కుటుంబ సభ్యులతో సంతోషంగా పండుగ జరుపుకోవాలని, బాణసంచా కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఆలిండియా యూనియన్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ చైర్మన్ మెండు మహేంద్ర భాస్కరరావు, డెప్యూటీ బ్రాంచ్ హెడ్ భాను, సిబ్బంది అనీషా, కల్పన, సుష్మ, రాజమోహన్, జగదీష్, గోపి, జనకమహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిప్రదాత



రేపల్లెలోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూలులో పటేల్‌కు నివాళి అర్పిస్తున్న విద్యార్థులు



రేపల్లెల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్ర



రేపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ సుచిత్ర

రేపల్లె రూరల్: స్వాతంత్ర్య సముపార్జనలో, దేశాభివృద్ధిలో, దేశ విలీనీకరణలో సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు స్ఫూర్తిదాయకమని ఆర్డీఓ నేలపు రామలక్ష్మి కొనియాడారు. భారత రత్న, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంత్యుత్సవం పట్టణంలోని ఆంధ్ర రత్న మున్సిపల్ హైస్కూలులో బుధవారం నిర్వహించారు. జాతీయ ఏక్తా దివస్ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. జునాగఢ్, హైదరాబాద్ వంటి అనేక సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసిన ఘనత పటేల్‌కే దక్కుతోందన్నారు. భారత దేశ ఉపప్రధానిగా, రాజ్యాంగ నిర్మాణ సమయంలో ప్రాథమిక హక్కుల కమిటీ చైర్మన్‌గా ఆయన సేవలు ఎనలేనవన్నారు. పటేల్‌ను యువత స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, స్కూల్ హెచ్‌ఎం ప్రవీణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఏక్తా దివస్

దేశాభివృద్ధికి ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అందించిన సేవలు అజరామరమని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్ర అన్నారు. జాతీయ ఏక్తాదివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకుని దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. సమాజ సేవా కార్యక్రమాలలో తమ సేవలు అందించి దేశభక్తులుగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని శివాజీ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన జాతీయ ఏక్తా దివస్ వేడుకల్లో భాగంగా సీడీపీవో సుచిత్ర చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు.

కొల్లూరులో మానవ హారం

కొల్లూరు : ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంత్యుత్సవం కొల్లూరులో ఘనంగా నిర్వహించారు. బుధవారం కొల్లూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి విద్యార్థులతో కలసి ప్రభుత్వ అధికారులు ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహారావు, పంచాయతీ ఈఓ బి.మల్లికార్జున, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భట్టిప్రోలులో జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ

భట్టిప్రోలు: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంత్యుత్సవం సందర్భంగా బుధవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో ఎస్.వెంకటరమణ మాట్లాడుతూ పటేల్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ శివపార్వతి, ఫీల్డ్ అసిస్టెంట్స్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీ నిర్వహించారు. అలాగే గురువారం తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె సేవలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ నీలం దేవరాజు విచ్చేశారు. మోరల్ డైరీ రాసిన 81 మంది విద్యార్థులకు పెదలంక సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు వెంకటేశ్వరరావు, థైవాన్ జామ మొక్కలను బహుమతులుగా అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, కరస్పాండెంట్ పి.మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొల్లూరులో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మానవ హారంగా విద్యార్థులు



భట్టిప్రోలులో జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ, సిబ్బంది



భట్టిప్రోలు హైస్కూల్లో సమైక్యత ప్రతిజ్ఞ చేస్తున్న ఎంఈఓ దేవరాజు

గుప్త నిధుల కోసం తవ్వకాలకు కళ్లెం వేయాలి

భట్టిప్రోలు: భట్టిప్రోలు శివారు అద్దేపల్లిలో గుప్త నిధులు ఉన్నాయని కొందరు భూములను అక్రమంగా తవ్వుతూ స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యదర్శి పీజీ అరుణ్‌శాస్త్రి బుధవారం తహసీల్దార్ మేకా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. గుప్త నిధుల అన్వేషణలో భాగంగా తవ్వకాలను నిర్వహిస్తూ ఆ ప్రదేశాన్ని సందర్శించిన వారికి ప్రాణహాని ఉందని పుకార్లు పుట్టిస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక నాయకులు అక్రమంగా మట్టిని తవ్వుకుని సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. దీని వెనుక ఉన్న అంతర్యం తెలుసుకుని గ్రామస్తులలో నెలకొన్న ఫోబియాను తొలగించాలని కోరారు.

అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఘటన భట్టిప్రోలు మండలం ఓలేరు వద్ద జరిగింది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ బుధవారం పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. భట్టిప్రోలు మండలం ఓలేరు గౌడపాలెంకు చెందిన కేసన వెంకటేశ్వరరావు 15 మద్యం సీసాలను రేపల్లె నుంచి ఓలేరుకు తరలిస్తుండగా తమ సిబ్బందితో ఓలేరు సమీపంలో గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుని వద్ద నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరిచినట్లు వెల్లడించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులకు నిధులు

చెరుకుపల్లి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ముగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించేందుకు నిధులు మంజూరయ్యాయని ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 29 అంగన్‌వాడీ కేంద్రాలకు మంచినీటి సౌకర్యం, ఏడు అంగన్‌వాడీ కేంద్రాలకు మరుగు దొడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశామన్నారు.